# అహంకారం

రచన: కాను కొలను వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు

శేఖర్, వనజ ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అన్యోన్య దాంపత్యంతో, ఇద్దరు కవల మగ పిల్లల్ని కన్నారు.

పిల్లలు పుట్టిన తర్వాత, ఇద్దరివైపు తల్లిదండ్రులూ వారి ప్రేమ వివాహాన్ని ఆమోదించి, రాకపోకలు మొదలయ్యాయి. పిల్లలు స్కూలుకి వెళ్తున్నారు. ఇద్దరూ రెండవ తరగతి చదువుతున్నారు.

ఒకరోజు ఆఫీసు నుంచి ఫోన్ వచ్చింది పిల్లలు గొడవ చేస్తూ ఉండడం వల్ల, శేఖర్ బయటికి వెళ్లి ఫోన్ మాట్లాడాడు. వనజకు అనుమాన బీజం మొలకెత్తింది

అతని ఫోన్ చెక్ చేసింది. కాల్లాగ్‌లో "ప్రియ" అనే అమ్మాయితో కాల్ చేసి మాట్లాడినట్లు కనిపించింది.

అప్పటినుంచి నమ్మకం లోపించిన సంభాషణలు మొదలయ్యాయి...

"నిన్న ఎవరిదగ్గరినుంచి ఫోన్ వచ్చిందో చూశాను. నువ్వు ఎందుకు—చేస్తున్నావు? ప్రియ ఎవరు?! అడిగింది వనజ.

" ఆఫీస్‌లో కోలీగ్ ఫోన్ చేసింది. ఆ విషయాన్ని నీకు చెప్పాల్సిన అవసరం లేదు". మెల్లిగా చెప్పాడు శేఖర్..

"నా మీద మోజు తీరిపోయిందా? లేకపోతే నాకు తెలియకుండా ఇంకెవరైనా ఉన్నారా?" ప్రశ్నించింది సూటిగా వనజ.

'ఎప్పుడూ అనుమానంతో ఉంటే ఎలా బతకాలి నేను?అడిగాడు శేఖర్. "ఇంత సంపాదిస్తున్నా గౌరవం లేకుండా పోయింది. "కోపంగా అన్నాడు శేఖర్.

"నువ్వు సంపాదించేదానికంటే నేను తక్కువ కాదు. ఇంట్లోనూ, నేను చాకిరీ చేస్తుంటాను."బదులు ఇచ్చింది వనజ.

"ఇలా మాట్లాడావంటే నాకు కోపం వస్తుంది. నేను బయటకి పోతా!" విసుగ్గా అన్నాడు శేఖర్.

"ఇప్పుడు నాతో కూర్చుని రెండు నిమిషాలు మాట్లాడటానికి కూడా నీకు సమయం ఉండదు.అంతేగా? " అంది వనజ.

"ఇంటికి వచ్చాక ప్రశాంతంగా ఉండాలనుకుంటే, నువ్వు కొత్తగా గొడవలు పెడతావు." విసుక్కున్నాడు కోపంగా శేఖర్.

"అంతేనా? నేనుంటే నీకు శాంతి పోతుందా?" ఏడుస్తూ అడిగింది వనజ...
"నిన్న మా అమ్మ చెప్పింది... నువ్వు ఈ మధ్య చాలా స్వేచ్ఛగా తిరుగుతున్నావట!" అడిగాడు శేఖర్.

"నాకు జీవించడానికి కూడా హక్కులేదా? అమ్మగారింటికి వెళ్ళడానికి నీ అనుమతి తీసుకోవాలా?"

"నువ్వు మారాలి. ఇలా అయితే మనం కలిసి ఉండలేం. "గట్టిగా చెప్పాడు శేఖర్.

"పిల్లల స్కూల్ ఫీజు కట్టమని చెప్పాను. పట్టించుకోలేదు. నేనే వెళ్ళి కట్టాను. ఇది బయట తిరగడమా"?అడిగింది వనజ

"నాకు పని ఒత్తిడి ఉంది. ప్రతి విషయంలో నన్నే నిందించడం ఎందుకు? నీకూ బాధ్యత ఉందిగా..."అన్నాడు శేఖర్

"నీవు ఈ మధ్య మారిపోయావు. ప్రేమగా మాట్లాడటమే లేదు".శేఖర్..
"ప్రేమ అనే మాట మన మధ్య ఎప్పుడు ఉంది గనుక?" వనజ.

ఈ తరహా సంభాషణలు రోజూ వారిద్దరి మధ్య చోటు చేసుకుంటున్నాయి. ఒకరోజు శేఖర్ ఇంటికి వచ్చేసరికి ఇల్లు తాళం వేసి ఉంది. పిల్లలు స్కూల్ నుంచి వచ్చి, ఎవరూ పట్టించుకునే వాళ్ళు లేక. మెట్ల మీద కూర్చుని ఏడుస్తున్నారు.

శేఖర్ కోపం నెత్తికి ఎక్కింది. కాసేపటికి వచ్చిన వనజమీద  అరిచాడు "బాధ్యత లేకుండా ఎక్కడికి వెళ్ళావు?" అడిగాడు శేఖర్.

"మా అమ్మగారి ఇంటికి వెళ్ళాను. దారిలో ట్రాఫిక్ వల్ల లేట్ అయింది చెప్పింది" వనజ. "దానికి అంత అరుపు అవసరమా?"

వనజ గట్టిగా మాట్లాడి బెడ్రూంలోకి పోయి తలుపేసుకుంది...

ఒకరోజు శేఖర్ ఫ్రెండ్స్ పార్టీ అంటూ,మద్యం తాగి వచ్చాడు.

వనజ గొడవ చేసింది. తాగిన మత్తులో, శేఖర్ వనజపై చేయి చేసుకున్నాడు. వనజ అహం దెబ్బతింది. బట్టలు సర్దుకుని, పిల్లల్ని తీసుకుని అర్ధరాత్రి పుట్టింటికి వెళ్లింది.

తల్లిదండ్రులు మందలించారు.”తప్పు “అని చెప్పబోయారు...
“ఇక్కడ ఉండిపోను. ఉద్యోగం దొరికేదాకా ఉండనివ్వండి” విసురుగా చెప్పింది, వనజ తల్లిదండ్రులకు.

పిల్లల్ని తల్లికి అప్పజెప్పి, ఉద్యోగంలో చేరి, వేరే కాపురం పెట్టిన తర్వాత, విడాకుల కోసం లాయర్‌ను సంప్రదించింది.

శేఖర్ కూడా, “ఆమెకు అంత పట్టుదల ఉంటే, నేను ఎందుకు దిగిరావాలి?” అనుకున్నాడు.

సంవత్సరం తర్వాత విచారణ జరిపి, కోర్టు ఇద్దరికీ విడాకులు మంజూరు చేసింది.

ఇప్పుడు శేఖర్, వనజ స్నేహితులు అడిగారు: “మీరిద్దరూ ఎందుకు విడాకులు తీసుకున్నారు? అంత బలమైన కారణమేమిటి?”

## ఇద్దరూ ఒకటే సమాధానం చెప్పారు:
## “అతనికి గర్వం... ఆమెకు గర్వం...”

